# గ్రంథాలయ నిర్మాణం అభినందనీయం

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీరామమూర్తి**



**కానూరులో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీరామమూర్తి, చిత్రంలో ఎమ్మెల్యే శేషారావు, దాత వెంకటలక్ష్మి**

పెరవలి (తణుకు అర్బన్) : తండ్రి జ్ఞాపకార్థం గ్రంథాలయ భవన నిర్మాణానికి విరాళం అందించటం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జయవరపు శ్రీరామమూర్తి దాతను అభినందించారు. పెరవలి మండలం కానూరులో అనపర్తి విశ్వనాథం మాస్టారు స్మారక గ్రంథాలయ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరామమూర్తి మాట్లాడుతూ జిల్లాలో శాఖా గ్రంథాలయ భవన నిర్మాణాలకు రూ. 1.75 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ ఏడాది రూ.70 లక్షలతో పుస్తకాలు కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. కొన్ని శాఖా గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా మారుస్తామన్నారు. టీవీలకు అతుక్కుపోతున్న నేటి రోజుల్లో గ్రంథాలయాల ప్రాధాన్యత కొద్దిగా తగ్గినా అభివృద్ధి కమిటీల పనితీరుతో ఇప్పటికీ కళ తప్పలేదన్నారు. ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ అందరికీ విద్య అనే నినాదంతో పనిచేసిన అనపర్తి విశ్వనాథం మాస్టారు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె మొగల్లపు వెంకటలక్ష్మి రూ.10 లక్షలు విరాళం ఇచ్చి గ్రంథాలయ భవన నిర్మాణానికి పూనుకోవడం సాధారణ విషయం కాదన్నారు. బాలలు, యువత విజ్ఞాన భాండాగారాన్ని సద్వినియోగం చేసుకుని మాస్టారు ఆశయాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ గ్రంథాలయాన్ని పూర్తిస్థాయి శాఖా గ్రంథాలయంగా తీర్చిదిద్దేందుకు గ్రంథాలయ చైర్మన్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీరామమూర్తిని కానూరు ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలోను, ఎమ్మెల్యేను, దాత వెంకటలక్ష్మిని గ్రామస్తులు సత్కరించారు. ఇదే వేదికపై బాలికా సంరక్షణ పథకం ధ్రువీకరణ పత్రాలను 36 మందికి అందజేశారు. సభకు ఎంపీపీ శిరిగినీడి శేషగిరిరావు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో ఎస్వీవీ రాజేశ్వరరావు, నాయకులు అంబటి బ్రహ్మయ్య, వైనాట్ షోరూం అధినేత రాయుడు, మాజీ సర్పంచ్ వీరమల్లు శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాధనాల ప్రసాద్ పాల్గొన్నారు.